

సత్యవేడు సభకు హాజరైన జన సందోహం



సత్యవేడుపై పెద్దిరెడ్డి పెత్తనమేంటి?

టీడీపీ అధినేత చంద్రబాబు

సత్యవేడు, ఏప్రిల్ 20: 'నీది ఏ ఊరు పెద్దిరెడ్డీ? సత్యవేడుపై నీ పెత్తనమేంటి? సత్యవేడు నుంచి రోజుకు 200 టిప్పర్ల గ్రావెల్, ఇసుక చెన్నైకు తరలించింది నిజం కాదా? సురుటుపల్లి దగ్గర నేనే చూశా. ఆకాశమే హద్దుగా దోపిడీ చేశారు' అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి సత్యవేడు క్లాక్ టవర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.' ఎక్కడో పుంగనూరులో ఉండే పెద్దిరెడ్డి సత్యవేడులోని ఇసుక, మట్టిని చెన్నైలో అమ్ముకుంటాడు. ప్రశ్నించిన ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఈసారి పనికిరావన్నారు. ఇదేం పద్ధతి' అంటూ ప్రశ్నించారు. 'సత్యవేడుకు సమీపంలోనే నేషనల్ హైవే, శ్రీసిటీ ఉంది.ఇది పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ప్రత్యేక ప్రణాళికతో సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాలను ఆదునిక నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతా. సత్యవేడును జిల్లాలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తా. ఆ బాధ్యత నాదీ' అని భరోసా ఇచ్చారు. సత్యవేడు డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించడంతో పాటు ఇక్కడే రిజర్వాయర్‌ను ఆధునీకీకరిస్తానని, అరుణానదిలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రిస్తానని, నదీ పరివాహక ప్రాంతలో భూగరర్భ జలాల పెంపుకోసం విరివిగా చెక్ డ్యాంలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. దాసుకుప్పం - సత్యవేడు బైపాస్ రోడ్డు , మతంగీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. కేవీబీపురం మండలంలోని కాళంగి పనులు చేపడతామన్నారు. తెలుగు గంగ కాలువకు ఉపకాలువలు నిర్మించి నియోజకవర్గానికి తాగు, సాగు నీరును అందిస్తామన్నారు.సురుటుపల్లె, నారాయణవనం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. శ్రీసిటీలో ప్రస్తుతమున్న 192 పరిశ్రమలకు తోడు మరో 400 పరిశ్రమలు వచ్చేలా చూస్తానన్నారు. హీరో, అపోలో, శ్రీసిటీ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.'అటవీ భూముల్లో యూకలిప్టస్ చెట్లను కూడా రూ.7వేల విలువ చేసేవి రూ.3వేలకు కొని, రూ 4 వేలు కొట్టేసే సైకో బ్యాచ్ జిల్లాలో తిష్టవేసింది. చివరకు వైసీపీ ఎర్రచందనం స్మగ్లర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే స్థాయికి దిగజారింది' అని చంద్రబాబు విమర్శించారు. గోదావరి జలాలను సత్యవేడుకు తీసుకొచ్చి ఇక్కడివారి జీవితాలు మారుస్తానన్నారు.

అన్నీ ఆలోచించే ఆదిమూలానికి టికెట్

'వైసీపీ నుంచి వచ్చాడని ఆదిమూలంపై టీడీపీ నాయకులకు అనుమానం ఉండొచ్చు. నేను అన్నీ ఆలోచించా. ఒక దుర్మార్గుడిపై నువ్వెంతంటే నువ్వెంత అని తిరుగుబాటు చేసి, ఎంపీ సీటు ఇస్తానంటే, ఎంపీ టికెట్టూ వద్దు, మీపార్టీ వద్దని మొహంమీదే చెప్పివచ్చినవ్యక్తి ఆదిమూలం. అక్కడే నేను ఆలోచించా.ఒక తిరుగుబాటు నాయకుడు దొరికాడని ఆలోచించే అభ్యర్థిగా ప్రకటించా. ఆదిమూలం నా దగ్గరే పెరిగాడు. టీడీపీలోనే జడ్పీటీసీ, ఫ్లోర్‌లీడర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేశాడు. హేమలత, జేడీఆర్ పార్టీ కోసం కష్టపడ్డారు. వారి కష్టాన్ని గుర్తించి సముచిత స్థానం కల్పిస్తాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వరప్రసాద్ కూడా వైసీపీలో అవమానాలు భరించలేక తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. వీరిద్దరినీ ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు.

తగ్గిన నామినేషన్ల జోరు

మూడో రోజు

పార్లమెంటుకు 2, అసెంబ్లీకి 9

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 20: జిల్లాలో మూడో రోజు నామినేషన్ల జోరు తగ్గింది. చిత్తూరు పార్లమెంటు స్థానానికి రెండు, అసెంబ్లీ స్థానాలకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. పుంగనూరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు ఏమీ రాలేదు. ఇప్పటివరకు మొత్తం నామినేషన్ల సంఖ్య 49కి చేరింది. చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్.శోభ రెండు సెట్ల నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షన్మోహన్‌కు అందజేశారు. నగరి అసెంబ్లీ నియోజకవర్గానికి సమాజ్‌వాదీ పార్టీ తరఫున వి.సరిత నామినేషన్ వేశారు. గంగాధరనెల్లూరు (ఎస్సీ)కు టీడీపీ తరఫున గాంధీ రత్నవేలు ఒక నామినేషన్, కళత్తూరు ప్రతిభాగాంధీ వైసీపీ తరఫున రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్‌గా వి.తేజేష్, పూతలపట్టు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి సమాజ్‌వాదీ పార్టీ తరఫున అమ్మూరు పురుషోత్తం నామినేషన్ అందజేశారు. పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ నుంచి బి.శివశంకర్, బీఎస్పీ నుంచి ఆర్.శోభ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సి.ఉమామహేశ్వర్ రెడ్డి నామినేషన్లు అందజేశారు. ఆదివారం ప్రభుత్వ సెలవురోజు కావడంగో నామినేషన్ల స్వీకరించేది లేదని అధికారులు తెలిపారు.

కలిసి కదిలితే జయం మనదే..!

- 'సూపర్ సిక్స్'పై విస్తృత ప్రచారం చేయండి
- మంచి మెజారిటీ సాధించిన బూత్ ప్రాంతాన్ని దత్తత తీసుకుంటా
- టీడీపీ ప్రజాప్రతినిధులతో నారా భువనేశ్వరి

కుప్పం, ఏప్రిల్ 20: అభిప్రాయ భేదాలు వీడి కలసి కదిలితే విజయం తప్పకుండా వరిస్తుందని నారా భువనేశ్వరి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కుప్పం పర్యటనలో రెండవ రోజైన శనివారం పార్టీ కార్యాలయంలో ఆమె నియోజకవర్గంలోని టీడీపీ ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. టీడీపీ ఒక కుటుంబం లాంటిదని, కుటుంబమన్నాక చిన్నచిన్న విభేదాలు సహజమని, కానీ విజయం వైపు అడుగులేసేటప్పుడు వాటిని పక్కనపెట్టేయాలని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఒక్కతాటిపైకి వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చారు. మే 10వ తేదీ వరకు తానూ ప్రజల్లో ఉంటూ ప్రచారం చేస్తానన్నారు. చంద్రబాబు 7 దఫాలుగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారంటే కుప్పం ప్రజలు ఆయనమీద పెట్టుకున్న నమ్మకం ఎటువవంటిదో అర్థమవుతోందన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించిన బూత్ గల ప్రాంతాన్ని తాను దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. వైసీపీవారు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగవద్దని, జీవితాలను బలిపెట్టుకోవద్దని హితవు పలికారు. అంతకుముందు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు కుప్పం ప్రజలు లక్ష ఓట్ల మెజారిటీ ఇస్తారడానికి ఆయన నామినేషన్‌కు వచ్చిన జన స్పందనే నిదర్శమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబును నమ్ముకున్న వారెవరూ మోసపోరు అన్నదానికి తాను నిదర్శమని, రాజకీయ నేపథ్యం లేకపోయినా తనను అనేక పదవుల్లో కూచోబెట్టారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కేసులతో వేధించారు

వైసీపీ ఐదేళ్ల పాలనలో తమను, పార్టీ శ్రేణులను అక్రమ కేసులు బనాయించి వేధించారని టీడీపీ ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే అక్రమ కేసులను ఎత్తివేయాలని, తమ బిడ్డల భవిష్యత్తును బాగు చేయాలని కోరారు. జగనన్న రీ సర్వే పేరుతో అనేకమంది అమాయకుల భూములను వైసీపీ నేతలు లాక్కున్నారని, ఈ సర్వేను రద్దు చేయాలని కోరారు. కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాలను ఏర్పాటు చేస్తే కార్యకర్తల పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆకాంక్షించారు. భువనేశ్వరి వారికి సమాధానం ఇస్తూ పార్టీ శ్రేణులు కోరుకుంటున్న అన్ని సమస్యలకు పరిష్కారాలు తప్పకుండా లభిస్తాయని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న భువనేశ్వరి



చిత్తూరు పార్టీ కార్యాలయంలో

నారా భువనేశ్వరితో కుప్పంలో ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల



- మామిడి రైతుల కోసం మ్యాంగో బోర్డు ఏర్పాటు
- చిత్తూరు దాహార్తిని తీర్చేందుకు అడవిపల్లె ప్రాజెక్టు పనుల పూర్తి

చిత్తూరుకు యూనివర్సిటీ.. నాది గ్యారంటీ

ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేసిన చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

గత ఎంపీల తరహాలో ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా నేరుగా తనకంటూ ప్రత్యేక ప్రణాళికను రచించుకుని ముందుకుపోతున్నారు చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు. టీడీపీ అధిష్ఠానం ఆయన్ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి తన మార్క్ ప్రచారంతో దూసుకుపోతున్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకుని వెళుతున్నారు. ఈయనతో సమానంగా ఆయన కుమారుడు, రాధే కన్‌స్ట్రక్షన్ అధినేత రాధే కూడా ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. దగ్గుమళ్ల కుటుంబం కూడా ఆయన గెలుపు కోసం రాత్రింబవళ్లు కృషి చేస్తోంది. ఈ నెల 18న దగ్గుమళ్ల కుటుంబ సభ్యులతో ఎలాంటి ఆడంబరాలూ లేకుండా సాదాసీదాగా ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆదర్శంగా నిలిచారు.

\- చిత్తూరు



ఈ క్రమంలోనే తాను పోటీ చేస్తున్న చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించారు. శనివారం చిత్తూరు టీడీపీ జిల్లా కార్యాలయం సహా పలుచోట్ల చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, రాధే, కాజూరి బాలాజీ, కాజూరి రాజేష్, టీడీపీ నేత, విశ్రాంత ఎస్పీ చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు దొరబాబు, సీఆర్ రాజన్, గురజాల జగన్మోహన్, చంద్రప్రకాష్, కఠారి హేమలత, సురేంద్రకుమార్, కోదండయాదవ్, సుబ్రి, త్యాగరాజన్, వైవీ రాజేశ్వరిలతో కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు.



చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు





మేనిఫెస్టో లోగోలు

- జిల్లా కేంద్రమైన చిత్తూరులో చెప్పుకోదగ్గ విద్యా సంస్థలులేవు. దీంతో దగ్గుమళ్ల విద్యా ప్రమాణాలను పెంచేందుకు యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.
- జిల్లాలో మామిడిసాగు ఎక్కువగా ఉంది. మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకునేందుకు మ్యాంగో బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- ప్రస్తుతం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదు. తాను ఎంపీగా గెలిస్తే ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరులో ఆగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.
- కాట్పాడి నుంచి తిరుపతి వరకు డబుల్ రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- చిత్తూరు చుట్టూ జరిగే రోడ్డు ప్రమాదాల బాధితుల కోసం కనీసం ట్రామాకేర్ సెంటర్ కూడా లేదు. తాను గెలిస్తే చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కచ్చితంగా ట్రామాకేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తానన్నారు.
- జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- చిత్తూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దే బాధ్యత తనదే అన్నారు.
- సీఎంసీ ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.
- అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు నీళ్లను తీసుకొచ్చి నగర ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు.
- చిత్తూరులో ఆటోమొబైల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు.
- నగరిలో చేనేత కార్మికుల కోసం ప్రత్యేకంగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేసి అక్కడి భూ గర్భ జలాలు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు.
- జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో ఏనుగుల బెడద కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్య నివారణకు బంగారుపాళ్యం నుంచి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కందకాలు నిర్మిస్తామన్నారు.

దగ్గుమళ్ల మేనిఫెస్టో ఇలా...

- పలమనేరులోని సిల్క్ ఫామ్ ఆధునికీకరణకు చర్యలు చేపడతామన్నారు.
- జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వేదపాఠశాల ఏర్పాటుతో పాటు అధునాతన సదుపాయాలతో ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తానని సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చి మరిచారు. ఎంపీగా గెలిస్తే ఆ నియోజకవర్గంలో కచ్చితంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గలో లెదర్‌పార్కును ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానన్నారు.
- పలమనేరు, కుప్పం ప్రాంతాలకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
- చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినప్పటికీ దాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎంపీగా గెలిస్తే ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రత్యేక పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక భరోసా ఇస్తామన్నారు.
- గత టీడీపీ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించి వ్యవసాయాన్ని పండుగలా చేసింది. వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తెచ్చేలా డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.
- మహిళలకు ఉపాధి కల్పించేందుకు అంతర్జాతీయ సంస్థల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు.
- నిరుద్యోగ యువతకు పలు రంగాల్లో నైపుణ్యతను పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీతో పాటు స్టడీ సర్కిల్స్‌ను తెస్తామన్నారు.
- తరచూ జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
- జిల్లాలో చెరువులను మరమ్మతులు చేసి భూగర్భ జలాలు పెంచేందుకు కొత్తగా చెక్‌డ్యాములను నిర్మిస్తామన్నారు.
- అడవులను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.
- క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు చిత్తూరులో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.
- ఈడిగ, గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రచిస్తామన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



టీడీపీ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

రామకుప్పం, ఏప్రిల్ 20: రామకుప్పంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మెన్ సీతాపతి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి వెంకటాచలంలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో నేతలు రామ్మూర్తి, రామకృష్ణప్ప, కృష్ణానాయక్, జయశంకర్, నాగభూషణం, మనోహర్, గంట్లప్పగౌడు, పద్మమ్మ, రామలింగారెడ్డి, భానుమూర్తి, పెరుమాళ్, జ్ఞానశేఖర్‌రెడ్డి, రాజకుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ పరామర్శ



మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆంజినేయరెడ్డి

రామకుప్పం, ఏప్రిల్ 20: రామకుప్పం మండలం తిమ్మసముద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పాపన్న కుమారుడు సోమశేఖర్, ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శనివారం టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటాచలం తదితరులు సోమశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పాపన్న కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

మయూర వాహనంపై కాశీవిశ్వేశ్వరుడి విహారం



రామకుప్పం, ఏప్రిల్ 20: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు, అమ్మవారితో కలిసి మయూర వాహనంపై విహరించారు. ఉభయదారులు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి విద్యుద్దీప, పుష్పాలంకృత మయూర వాహనంలో అమ్మవారితో కలిసి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరి కాయలు కొట్టి కర్పూరహారతులిచ్చారు. రాత్రి ఆలయం ఎదుట కర్ణాటక రాష్ట్రం చిన్నకొత్తూరుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పండరి భజన వీక్షకులను అలరించింది.

22న చల్లా రామచంద్రారెడ్డి నామినేషన్



విలేకరులతో మాట్లాతున్న నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 20: ఈ నెల 22న టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ మైనార్టీ యువనేత సుహేల్‌బాషా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పుంగనూరు మార్పు కోరుకునే ప్రతి ఒక్కరూ నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలీస్ గిరి, సద్దాంహుస్సేన్ పాల్గొన్నారు.

కాగతిలో పలువురు టీడీపీలో చేరిక



చౌడేపల్లె, ఏప్రిల్20: కాగతి పంచాయతీలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వాసు, మధు, భాస్కర్, వినోద్, భాను, నగేష్ తదితర యువకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బోయకొండ సుబ్బు పాల్గొన్నారు. ● గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా శ్రీనివాసకళ్యాణ మండపం వద్ద కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు చిన్నికిశోర్, ప్రవీణ్ కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



మల్లానూరులో అన్నదానం చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని మల్లానూరులో శనివారం చంద్రబాబు జన్మదిన వేడులను మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జి దామోదర్, స్థానిక పంచాయతీ అధ్యక్షుడు రమేశ్, విభూషణ్, బూత్ ఇన్‌ఛార్జిలు రాజ్‌కుమార్, వెంకటేశ్, నాగార్జున, అన్నాదొరై, సాము, కళైసెల్వం, యతిరాజులు, జయరామన్, విజయ్ కుమార్, రాజ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 20: అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక భగత్‌సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్నిమాక కేంద్రానికి సమాచాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఐ సుప్రియ, అగ్నిమాక సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో చోరీ..పోలీసులకు ఫిర్యాదు

వి.కోట, ఏప్రిల్ 20: వి.కోటలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఆటో చోరీ చేశారు. డ్రైవర్ షేక్‌బాబు శుక్రవారం సిలిండర్లు సరఫరా చేశాక ఆటోను దాసార్లపల్లె వద్దనున్న కార్యాలయం వద్ద రాత్రి ఉంచాడు. శనివారం వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

సోమల, ఏప్రిల్ 20: మండలంలోని పేటూరుకు చెందిన ఎన్.రెడ్డెప్ప సారా విక్రయిస్తుండగా శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ. వెంకట నరసింహులు తెలిపారు. నిందితుడి నుంచి 18 లీటర్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీలో చేరిన గడ్దూరు గ్రామస్తులు



అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన గడ్దూరు గ్రామస్తులు.

పలమనేరు, ఏప్రిల్20 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్దూరు గ్రామానికి చెందిన 30 మంది వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మాజీ మంత్రి అమరనాథరెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గడ్దూరు గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ కేశవులు, దొరస్వామి, ఉమాపతి, దండపాణి, వెంకటరమణ, నాగ, కార్తీక్, రెడ్డి, శివాజీ, లక్ష్మీపతి, సుబ్రమణ్యం, రాజేష్, సుబ్బు, భాస్కర్, మహేంద్ర, హేమాద్రి, హేమంత్, అరుణ్‌కుమార్, ఈశ్వర్, జ్ఞానేంద్ర, కుప్పస్వామి, గౌతమ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్వీబాలాజి, ఆర్సీసీకుట్టి, గిరిబాబు, క్రిష్ణమూర్తిగౌడు, నాగరాజు, ఖాజాపీర్, నరేష్, సుబ్రమణ్యం, లోకమూర్తి, గోపి, నదీం, భాస్కర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదినవేడుకలు

చంద్రబాబు జన్మదిన వేడు కలను పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి పార్టీ నాయకుల మధ్య కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్సీసీకుట్టి, ఖాజాపీర్, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, గిరిబాబు, మదన్ మో హన్, మాబాషా, చిన్ని, శీను, రవి, సుబ్బు, ప్రమీలమ్మ, పర్వీన్, పెద్దపంజాణి మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అమరనాథరెడ్డి

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ ఎంపీటీసీ కుమారుడు



అశోక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, ఏప్రిల్ 20: వైసీపీకి చెందిన రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె ఎంపీటీసీ సుబ్బమ్మ కుమారుడు అశోక్ శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబులు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో తాము ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని అశోక్ ఈ సందర్భంగా తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలోనే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయనే నమ్మకంతోనే టీడీపీలో చేరానన్నారు. తమ కుటుంబంతో పాటు తమ అనుచరులంతా ఈసారి ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ సాధనలో భాగస్వాములవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కుప్పం మున్సిపాల్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, సీనియర్ నేత నందారెడ్డి, నేతలు వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, రామకుప్పం వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



పెద్దఉప్పరపల్లెలో సీతారాముల కల్యాణోత్సవం

సోమల, ఏప్రిల్ 20: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె కోదండ రామాలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదారులు పట్టుసిరి రాజశేఖర్ భక్తులకు అన్నదానం చేశారు. నాగిళ్లవారిపల్లె, బసవపల్లె, రెడ్డివారిపల్లె, ఆవులపల్లె, కొత్తూరు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అలాగే పత్రపల్లె రామాలయంలో భాగవ తారిణి అనసూయ సీతాదేవి అరణ్య వాసం హరికధ భక్తులను ఆకట్టుకుంది.

చంద్రబాబు రాగానే రూ.4వేల పింఛన్

చౌడేపల్లె, ఏప్రిల్20: టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే అవ్వాతాతలకు రూ.4000 పింఛన్ ఇవ్వనున్నట్లు పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆమె చౌడేపల్లెలోని బత్తలాపురంరోడ్డు, టీచర్స్‌కాలనీ, భజంత్రీకాలనీ, బాలసముద్రం, చుక్కావారిపల్లె తదితర గ్రామాలలో ఇంటింటా ప్రచారం చేశారు. చల్లా రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, నాయకులు ప్రదీప్‌రాజు, విజయలక్ష్మి, హరిప్రసాద్, రెడ్డి, కార్తీక్, ప్రభాకర్, పార్థసారథి, పవన్, గిరిరాజు, ఆది, కిశోర్, బీజేపీ నాయకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, మల్లిక, జనసేన నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో టీడీపీ జెండా ఎగరడం తథ్యం

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరులో టీడీపీ జెండా ఎగరడం తథ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం 102 ఈ రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ చింతలవారిపల్లికి చెందిన వైసీపీ నాయకులు రవి, మునికృష్ణ, మహేష్ తదితరులు టీడీపీలో చేరారు. చల్లా రామచంద్రారెడ్డి వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు సీహెచ్ కుమార్‌రెడ్డి, ధనంజయ నాయుడు, బండ్ల రమేష్ తదతరులు పాల్గొన్నారు.

చల్లాబాబు గెలుపుకోసం కాణిపాకంలో పూజలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 20: చల్లా రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలని రొంపిచెర్ల పంచాయతీ వారణాసివారిపల్లె వాసులు కాణిపాకంలోని వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి వస్త్రం, పూలమాల, ప్రసాదాలు చల్లాబాబుకు అందించారు. ఈపూజల్లో రాజేంద్ర, మురళి, హరి, చిన్నరెడ్డెప్ప ఎం.వెంకట్రామయ్య, సూరి, కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

రొంపిచెర్ల: చంద్రబాబు జన్మదిన వేడుకలు చల్లా రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. చల్లాబాబు కేక్ కట్ చేశారు.

సదుం: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చల్లా బాబు పేర్కొన్నారు. మండలంలోని కంభంవారిపల్లె, రెడ్డివారిపల్లె పంచాయతీల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు మాత్రమే ఉన్నాయన్నారు. అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. కాగా మండలంలోని ఊటుపల్లెకు చెందిన జేసీబీ శంకర, రమేశ్, శివయ్య, సోమశేఖర, మహేంద్ర తదితరులు టీడీపీలో చేరారు.



చల్లా సమక్షంలో టీడీపీలో చేరిన పులిచెర్ల మండల వైసీపీ నాయకులు



సదుం మండలం కంభంవారిపల్లె పంచాయతీ కురవపల్లెలో కరపత్రాలు పంచుతున్న చల్లా రామచంద్రారెడ్డి



చౌడేపల్లె మండలంలో బత్తలాపురం రోడ్డులో వీణారెడ్డి ప్రచారం



చల్లాబాబు గెలుపుకోసం కాణిపాకంలో పూజలు చేసిన రొంపిచెర్ల వాసులు

రైతు రాజ్యం కోసమే బీసీవై ఆవిర్భావం



రామచంద్రయాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన మైనార్టీలు

పుంగనూరు, ఏప్రిల్20: రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసమే భారత చైతన్య యువజన పార్టీజూట స్థాపించినట్లు ఆ పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. శనివారం తన స్వగృహంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మైనార్టీలతో పాటు కొంతమంది యువకులు బీసీవై పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతు సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. తనను గెలిపిస్తే పాల రైతులకు గిట్టుబాటు ధర, ప్రతి మండల కేంద్రంలో పాల డైయిరీ ఏర్పాటు, ప్రతి ఇంటికీ ఉచితంగా పాడిఆవు అందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలు, దాడులు, భూఆక్రమణల నుంచి కాపాడేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 25న బీసీవై అభ్యర్థిగా తాను నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని రహమంత్‌నగర్‌కు చెందిన మున్నా, మహ్మద్, బాబులాల్, రహీం, వెంకటరామయ్య, మహబూబుబాషా తదితరులు పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



కురవపల్లిలో సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు, ఏప్రిల్ 20: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ కురవ పల్లిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం వేడుకలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయశుద్ధి, ఆలయప్రవేశం, విష్వక్సేనారాధన, భగవతారాధన, గంగస్వీకరణ, గోపూజ నిర్వహించారు. సాయంత్రం సీతారాముల విగ్రహలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనము, కంకణధారణ, అంకురార్పణ, కలశ ప్రతిష్ఠ, అగ్ని ప్రతిష్ఠ, మంత్రహోమం, లఘుపూర్ణాహుతి, క్షీరాభిషేకం, అర్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 9 గంటలకు యంత్రస్థాపన, యంత్రప్రతిష్ఠ, కలశప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు అనంత కుమారాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

●నేడు సీతారాముల విగ్రహప్రతిష్ఠ వేడుకలు

కురవపల్లిలో ఆదివారం ఉదయం 8 నుంచి 9గంటల మధ్య సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకం వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కళ్యాణోత్సవం, రాత్రి సీతారాముల పుష్పపల్లకి ఊరేగింపు ఉంటుందని వివరించారు.

భవిష్యత్ బాగుండాలంటే బాబు సీఎం కావాలి



ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సోమల, ఏప్రిల్ 20: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుంటుందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. శనివారం సోమలలో టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పీఎం మల్లికార్జున, శివశంకర్, మహేంద్ర బాబు, అశోక్ కుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. ● గట్టువారిపల్లె, గాంధీ నగర్, తుగడంవారిపల్లెల్లో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం తదితరులు ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు



ప్రతిభా విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కల్లూరు, ఏప్రిల్ 20: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. 4, 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాత మనోహర్ కుటుంబసభ్యుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. 5వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన రూ.5000, మహీధర్‌కు రూ.3000, మిథున్‌కు రూ.2000, 4వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఖాజాకు రూ.1500, కార్తీక్‌కు రూ.1000, షాహీద్‌కు రూ.500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. హెచ్ఎం భానుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వార్షికోత్సవాలు



అడుసుపల్లె పాఠశాలలో సరస్వతీపూజ

సోమల, ఏప్రిల్ 20: ప్రభుత్వ బడుల్లో శనివారం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అడుసుపల్లె, వడ్డిపల్లె, గట్టువారిపల్లె, కందూరు, నెల్లిమంద తదితర బడుల్లో సరస్వతీపూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు సుబ్రమణ్యం, భారతి, సుజాత తదితరులు పాల్గొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈత కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంఈవో శివరత్న కోరారు.

పలమనేరులో మరో ముగ్గురి నామినేషన్



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్

పలమనేరు, ఏప్రిల్20 : పలమనేరు నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేసేందుకు శనివారం ముగ్గురు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గంగవరం మండలం నల్లగుట్లపల్లి గ్రామానికి చెందిన బి.శివశంకర్, బీఎస్పీ అభ్యర్థిగా వి.కోటకు చెందిన ఆర్.శోభ, స్వతంత్ర అభ్యర్థిగా కుప్పం నియోజక వర్గం రామకుప్పం మండలం మిట్టపల్లికి చెందిన సి.ఉమామహేశ్వరరెడ్డి నామినేషన్ వేశారు. వీరి నామినేషన్‌తో పలమనేరులో నామినేషన్ల సంఖ్య ఏడుకు చేరింది.

కొత్తపేటలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



కల్లూరు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నారని ఆ పార్టీ నాయకులు ధనంజయనాయుడు, రమేష్, గోపినాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కొత్తపేటలో శనివారం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేశారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు మోహన్, నాగరాజనాయుడు, రాజగోపాల్‌నాయుడు, దేవ, చెంగల్రాయనాయుడు, ధనంజయ, అరుణాచలంనాయుడు, బారేషా, మోహన్, రమణ, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

కన్నులపండువగా రాముల వారి కల్యాణం




సదుం, ఏప్రిల్ 20: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఉభయదారులుగా కోటిక నాగరాజ, విజయ కుమారి, నాగరాజు, వెంకటరమణి దంపతులు వ్యవహరించారు. వేదపండితులు గోపీ స్వామి బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



కుప్పం, ఏప్రిల్ 20: కుప్పం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరిగిన అగ్నిమాపక వారోత్సవాలు శనివారం నాటితో ముగిశాయి. చివరిరోజు అగ్నిమాపకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కుప్పంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్‌లో వంట గ్యాస్ వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలు, నివారణ పద్ధతులపై అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రెడ్డెన్న, కృష్ణయ్య, సత్య, లక్ష్మీనారాయణ, సతీశ్‌కుమార్, రామ్మూర్తి, రఘుపతి పాల్గొన్నారు.



9 కార్ల రోజా

ఎంత ఎమ్మెల్యే అయితే మాత్రం అన్ని కార్లు అవసరమా ఆయమ్మకి? అనే మాటలు నగరి నియోజకవర్గంలో జోరుగా వినిపిస్తున్నాయి. నామినేషన్‌తో పాటూ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి ఆర్కే. రోజా తనకు 9 కార్లున్నట్టు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆమె 6 కార్లున్నట్టు చూపగా ఈసారి మరో మూడు కలిపారు. జగన్ నవరత్నాలకు దీటుగా నవకార్లు సొంతం చేసుకున్నారని జనం మాటల్లో వినిపిస్తోంది. ఈ నవకార్లలో కోటికి పైగా విలువ చేసే బెంజ్ కారు కూడా ఉండడం విశేషం. ఈ కారు కొన్నపుడు ఆమె మీద విమర్శలు కూడా వైరల్ అయ్యాయి. హోండా పల్సర్ బైక్ కూడా రోజా ఆస్తుల్లో చూపారు. 2019లో గెలిచాక ఆస్తులు కూడా బాగానే కొన్నారే మంత్రిగారు అనే మాటలూ సాగుతున్నాయి. నగరి మండలం కీలపట్టు, వీరకావేరిరాజపురం, విజయపురం మండలంలోని పాతార్కాడులో 6.39 ఎకరాల వ్యవసాయ భూమి, భర్త సెల్వమణి నగరిలో 0.94 ఎకరాల వ్యవసాయ భూమి వీరికి ఉంది. అలాగే తెలంగాణలోని గచ్చిబౌలి, పుత్తూరులో ఇంటి స్థలాలు, భర్త సెల్వమణి పేరిట నగరిలో మూడు ఇంటి స్థలాలు కొనుగోలు చేసినట్లు చూపించారు. జగన్ ప్రభుత్వం పోరాడుతున్న మార్గదర్శిలోనూ రోజాకు దాదాపు రూ.40లక్షల చిట్ ఉండడం కూడా జనం మాటల్లో దొర్లుతోంది.

- పుత్తూరు అర్బన్

ఘనంగా బాబు జన్మదిన వేడుకలు

● భువనేశ్వరి పూజలు, కేక్ కటింగ్‌లు, అన్నదానాలు

కుప్పం, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు కుప్పంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఈ వేడుకల్లో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సామగుట్టపల్లెలోని కదిరి నరసింహస్వామి ఆలయంలో ఉదయం ఆమె చంద్రబాబు పేరుమీద పూజలు చేయించారు. ఆలయం బయట సూపర్ సిక్స్ పథకాలతో కూడిన భారీ కేక్ కట్ చేసి, పార్టీ కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఇక్కడ కూడా కేక్ కట్ చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీ మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కదిరి నరసింహస్వామి ఆలయంలో పూజల అనంతరం భువనేశ్వరి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ తన జన్మదిన వేడుకలను ప్రజల్లోనే జరుపుకుంటారని చెప్పారు. వారి బాగోగులు, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆయన నిరంతరం తపన పడుతుంటారన్నారు. దేశ, విదేశాల్లో సైతం ప్రజలు ఆయన పేరుతో పూజలు చేయిస్తుండడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్. మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కదిరి నరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భువనేశ్వరి



అన్నదానం చేస్తున్న భువనేశ్వరి



సూపర్ సిక్స్ పథకాలతో బాబు జన్మదిన కేక్

కుప్పం, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదినం సందర్భంగా కుప్పంలో శనివారం ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన 74 కేజీల కేక్ ఆకట్టుకుంది. భారీ కేక్‌పై మళ్లీ ఆరు చిన్నచిన్న కేక్‌లను అమర్చి తయారు చేశారు. ఆ చిన్న కేక్‌లపై మినీ మ్యానిఫెస్టో, చంద్రబాబు, భువనేశ్వరి జంట ఫొటోను అమర్చారు.

చంద్రబాబు గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

భువనేశ్వరితో ఎమ్మార్పీఎస్ నాయకులు

కుప్పం, ఏప్రిల్ 20: చంద్రబాబు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మార్పీఎస్ నేతలు ఆయన సతీమణి నారా భువనేశ్వరికి హామీ ఇచ్చారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో శనివారం వారు ఆమెను కలిసి ఘనంగా సన్మానించారు. వైసీపీ మాదిగలను మోసం చేసిందన్నారు. చంద్రబాబు అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. భువనేశ్వరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, అభివృద్ధికి చంద్రబాబు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.ఎస్.రాజ్‌కుమార్, సీనియర్ నాయకుడు జి.దేవరాజ్, ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాపన్న, రవీంద్ర, గోవిందప్ప, జయప్ప, రామచంద్ర, కె.కోదండ, జయరాం, మునెప్ప, అమర్‌నాథ్, శంకర్, శాంతి, రాముడు, తిమ్మరాజు, పవన్ పాల్గొన్నారు.



భువనేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి ప్రముఖులు

పలమనేరు, ఏప్రిల్20: పలమనేరుకు చెందిన పలువురు ప్రముఖులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పెద్దపంజాణి మండల మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, పలమనేరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కిరణ్‌కుమార్, గంగమ్మ గుడి మాజీ చైర్మన్ ఏకే మూర్తి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఫిరోజ్ టీడీపీలో చేరారు. సత్యవేడు పర్యటనకు విచ్చేసిన చంద్రబాబును వారు హెలిప్యాడ్ వద్ద కలిశారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్, నాగరాజు, మాజీ కౌన్సిలర్ కృష్ణమూర్తి గౌడ్ పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిన విజయభాస్కర్‌రెడ్డి, చిత్రంలో అమర్

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్ ఏప్రిల్ 20: జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం జడ్పీ చాంబర్‌లో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంటే పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఎండలు మండిపోతున్న తరుణంలో వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. వృద్ధులు, చంటి పిల్లలు, గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో గ్లోరియా, జడ్పీ వైస్ చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, డీఎంహెచ్‌వో రవిరాజు, జడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఏ మొహం పెట్టుకుని ఓటడుగుతావు స్వామీ?

డిప్యూటీ సీఎంను ప్రశ్నించిన వైసీపీ సర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి

పెనుమూరు, ఏప్రిల్ 20: ఐదేళ్లలో శాతంబాకం పంచాయతీకి ఏమి ఒరగబెట్టావని ఓటు అడగటానికి వస్తున్నావని డిప్యూటీ సీఎం నారాయణస్వామిని శాతంబాకం వైసీపీ సర్పంచ్ అభ్యర్థి సోమశేఖర్‌రెడ్డి నిలదీశారు. ఈ మేరకు ఆయన వీడియో విడుదల చేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, అలాంటిది శాతంబాకం సర్పంచ్‌గా పోటీ చేస్తే నారాయణస్వామి పార్టీకి ఓటు వేయని వారిని తనపై పోటీకి నిలబెట్టాడని, ఇదేంటని ఇంటికెళ్లి అడిగితే బయటకు వెళ్లమన్నాడని, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని తమ గ్రామానికి వస్తున్నావని అడిగారు. రాజశేఖరరెడ్డి విగ్రహం పెడితే దాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన వారిని పక్కన పెట్టి పార్టీకి కష్టపడిన తమను ఇబ్బందులు పెట్టడం బాధ కలిగించిందని అన్నారు. పార్టీని నమ్ముకుని ఆర్థికంగా చితికిపోయి ఊరు వదిలి వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

పొలం అమ్మేసిన మాజీ సీఎం కిరణ్

శంకర్‌పల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. జన్వాడలో ఆయనకు 1.20 ఎకరాల భూమి ఉండగా దానిని అమ్మేశారు.ఆ భూమిని కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు. కాగా, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కార్యాలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న చాలా మంది స్థానికులు, పలువురు నాయకులు కార్యాలయానికి వచ్చి ఆయనతో ఫొటోలు దిగారు.

ఇంటర్ విద్యార్థులకు రెమిడియల్ తరగతులు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 20: ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో చిత్తూరు జిల్లా చివరి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. మొదటి సంవత్సరంలో 13,224 మందికి గాను 6,566 మంది ఉత్తీర్ణత (49.65 శాతం) సాధించగా, 6,658 మంది ఫెయిలయ్యారు. ద్వితీయ ఇంటర్‌లో 10,882 మందికి గాను 6,817 మంది ఉత్తీర్ణత (62.64 శాతం) సాధించగా, 4,065 మంది ఫెయిలయ్యారు. మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఫెయిలైన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని ఇంటర్మీడియట్ విద్యామండలి నిర్ణయించింది.

పలమనేరు ప్రధాన అభ్యర్థుల ఆస్తుల వివరాలు

వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే వెంకటేగౌడ : పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆస్తులు ఐదేళ్ల వ్యవధిలో లక్షల నుంచి కోట్లకు పెరిగాయి. 2019లో తొలిసారి పలమనేరు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసినప్పుడు అఫిడవిట్‌లో తన చేతిలో నగదు రూ.3,52,440 అని, తన భార్య చేతిలో నగదు రూ.75,200 అని పేర్కొనగా ప్రస్తుత ఎన్నికల సందర్భంగా అంటే 2024 ఎన్నికలకు సమర్పించిన అఫిడవిట్‌లో తన చేతిలో నగదురూ.2,45,440 అని, తన భార్య పావని చేతిలో నగదు రూ.40,200లుగా పేర్కొన్నారు. ఇక బ్యాంకు డిపాజిట్లు, చరాస్థుల విలువ రూ.20,21,60,056లుగా, భార్య పేరున రూ.32,08,347గా పేర్కొన్నారు. స్థిరాస్థులు రూ.20,47,14,410, అప్పులు రూ.18,40,09,161గా పేర్కొన్నారు. ఇక 2019 ఎన్నికల్లో బ్యాంకులో ఉన్న నగదు, చరాస్థులు రూ.17,35,57,691, తన భార్య పావనికి రూ.27,06,624 చరాస్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. స్థిరాస్థులు రూ.2,33,28,410 ఉన్నట్లు పేర్కొన్నారు. అప్పులు రూ.5,35,24,443 ఉన్నట్లు పేర్కొన్నారు. అంటే 2019లో ఆస్థులు కేవలం 2.33 కోట్ల మేర ఉండగా అది 2024 నాటికి రూ.20.47 కోట్లకు పెరగడం గమనార్హం. అయితే 2019లో అప్పులు రూ.5.35 కోట్లు ఉండగా 2024లో అప్పులు కూడా రూ.18.40 కోట్లకు పెరిగాయి. వెంకటేగౌడపై ఒక చెక్‌బౌన్సు కేసు కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ కోర్టులో నడుస్తోంది.

తెలుగుదేశం అభ్యర్థి అమరనాథరెడ్డి ఆస్తుల వివరాలు : పలమనేరు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అమరనాథరెడ్డికి చరాస్థులు రూ.17,03,562,929 గాను, తన భార్య రేణుకారెడ్డి పేరున రూ.1,22,04,017, స్థిరాస్థులు రూ. 11,84,45,500, తన బార్య రేణుకారెడ్డి పేరున రూ.60,00,000, అప్పులు రూ.11,72,21,860, తన భార్య రేణుకారెడ్డికి రూ.71,25,850 లు ఉన్నట్లు నామినేషన్ సందర్భంగా అఫిడవిట్‌లో అమరనాథరెడ్డి పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో చేతిలో నగదు 60,786, తన భార్యరేణుకారెడ్డి పేరున 2,335 ఉన్నట్లు పేర్కొన్నారు. చరాస్థులు రూ.89,36,888, తన భార్య పేరున 3,30,595, స్థిరాస్థులు రూ. 4,48,75,663, తన భార్య పేరున రూ.5,75,300 ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక అప్పులు రూ.2,42,04,408, తన భార్య పేరున రూ. 9,25,850లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక అమరనాథరెడ్డిపై 24 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

- పలమనేరు

టీడీపీ ర్యాలీకి వెళ్లారని ముస్లిం దంపతులపై వైసీపీ దాడి

మరోసారి వారితో కన్పిస్తే చంపేస్తామని బెదిరింపు

రామకుప్పం, ఏప్రిల్ 20: కుప్పంలో శుక్రవారం చంద్రబాబు నామినేషన్ ర్యాలీకి వెళ్లారని ముస్లిం దంపతులపై వైసీపీ నేతలు దాడికి పాల్పడిన ఘటన రామకుప్పం మండలం 89పెద్దూరులో చోటుచేసుకుంది. 89పెద్దూరు గ్రామానికి చెందిన బాధితుడు నస్రూల్ రామకుప్పం పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. శుక్రవారం నస్రూల్ స్థానిక టీడీపీ కార్యకర్తలతో కలిసి కుప్పంలో ర్యాలీలో పాల్గొన్నాడు. శనివారం సాయంత్రం స్థానిక వార్డు సభ్యుడు రమేష్ ఫోన్ చేసి మాట్లాడాలని, ఇంటి వద్దకు రావాలని పిలిచాడు. ఆయన వచ్చి వైసీపీకే చెందిన ఎంపీటీసీ వెంకటరమణ ఇంటి వద్దకు వెళ్లాడు. వెంకటరమణతోపాటు వార్డు సభ్యుడు రమేష్, రౌడీషీటర్ సత్య ఉన్నారు. టీడీపీ ర్యాలీకి ఎందుకు వెళ్లావంటూ సత్య నస్రూల్‌పై బూతులతో విరుచుకుపడ్డాడు. తనపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నాయని, టీడీపీ వారితో మరోసారి కన్పిస్తే నరికి చంపేస్తానని బెదిరించాడు. అనంతరం నస్రూల్ చొక్కా పట్టుకుని, ఇటుకరాయితో ఎడమ చెంపపై కొట్టాడు. భయభ్రాంతుడైన నస్రూల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం 6గంటలకు రమేష్, సత్య, ప్రకాష్, రమేష్ భార్య కాంతమ్మ, శంకరప్ప, ప్రేమ్‌కుమార్, మురగయ్య, మణి నస్రూల్ ఇంటి వద్దకు వెళ్లి మతం పేరుతో దూషించారు. ఇంట్లో నుంచి బయటకు రావాలని కేకలు వేశారు. నస్రూల్ భార్య సలీమా బయటకు వచ్చి తన భర్తను ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించింది. సత్య ఆమెను జుట్టు పట్టుకుని మొహంపై పిడిగుద్దులు కురిపించాడు. అడ్డువెళ్లిన నస్రూల్‌ను విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో సలీమా కంటి కింద భాగం వాచిపోయింది. నస్రూల్ ఆమెను కుప్పం ఆసుపత్రిలో చేర్పించాడు. అనంతరం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వైసీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరాడు. కాగా, పాతకక్షలను మనసులో పెట్టుకుని నస్రూర్‌తో పాటు మరో తొమ్మిది మంది తన భర్త రమేష్‌తోపాటు తనపై దాడి చేశారని రమేష్ భార్య కాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అడ్డుకునే ప్రయత్నం చేసిన సత్యాపైనా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొంది.



నసీమా కంటి కింద వాచిన దృశ్యం- వాచిపోయిన నస్రూల్ ఎడమ చెంప

వాచ్‌మేన్‌పై కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు

కల్లూరు, ఏప్రిల్ 20: పులిచెర్ల మండలం మంగళంపేట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వాచ్‌మేన్ జి.మధు ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ శనివారం పులిచెర్ల ఎంపీడీవో సురేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ కోసం పుంగనూరుకు ఏర్పాటు చేసిన బస్సులో మధు ప్రయాణం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోను ఎంపీడీవోకు సమర్పించారు. వాచ్‌మేన్‌గా తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న మధును విచారించామని, బస్సులో ప్రయాణించింది నిజమేనని తేలిందని, పుంగనూరు రిటర్నింగ్ అధికారికి పంపామని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు.



బస్సులో వాచ్‌మేన్



పెద్దిరెడ్డి నామినేషన్ ర్యాలీలో మెప్మా ఆర్పీలు

పుంగనూరు, ఏప్రిల్20: పుంగనూరులో శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ ర్యాలీలో మెప్మా ఆర్పీలు, ఆడిటర్లు పాల్గొన్నట్లు శనివారం టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హనుమంతురాయదిన్నె నుంచి నిర్వహించిన ర్యాలీలో డీఎల్ఎఫ్ ఆర్పీ లలిత, నక్కబండ ఆర్పీ రూప, ఉబేదుల్లా కాంపౌండ్ ఆర్పీ శశిరేఖ, ఎన్ఎస్‌పేట ఆర్పీ మనిలత, పవిత్ర, ఆడిటర్లు వైసీపీ టోపీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నట్లు ఫొటోలు జత చేసి ఫిర్యాదు చేశారు.

ముగ్గురు వైసీపీ కార్యకర్తలపై కేసు

పలమనేరు, ఏప్రిల్20 : పలమనేరుకు చెందిన ముగ్గురు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదైంది. ఈ నెల 18వ తేదీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకటేగౌడ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా బాణసంచా కాల్చడంతో పోలీసులు వారిపై 341, 188, 286 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పలమనేరు ఆర్‌ఓ మనోజ్‌రెడ్డి తెలిపారు.

ముస్లిం మైనారిటీల భద్రత, సంక్షేమానికి గ్యారంటీ

కుప్పం, ఏప్రిల్ 20: ముస్లిం మైనారిటీల భద్రత, సంక్షేమం, అభివృద్ధికి చంద్రబాబు తరఫున తాను గ్యారంటీ ఇస్తానని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో శనివారం ఆమె నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ మహిళలతో సమావేశమయ్యారు. భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు తెచ్చిన డ్వాక్రా సంఘాలలో చేరి ముస్లిం మహిళలు ఎన్నో ప్రయోజనాలు పొందారని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో అమలు చేసిన పది సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ముస్లింలకు చెందాల్సిన ఆ నగదు మొత్తాన్ని ఈ ప్రభుత్వం ఏమి చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో షేక్ అబ్దుల్ సలాం కుటుంబాన్ని వైసీపీ నేతలు వేధించడంతో రైలుకింద పడి చనిపోయారని గుర్తు చేశారు. పలమనేరులో మిస్బ అనే విద్యార్థిని చదువులో వైసీపీ నేత కుమార్తెకంటే ముందున్నదని ఆ పార్టీ నేతలు వేధించడంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇంకా మరపునకు రాలేదన్నారు. రంజాన్ పండుగ కాలంలో నందికొట్కూరులో ఒక ముస్లిం సోదరి ప్రార్థన చేసుకుని వచ్చే సమయంలో వైసీపీ నేత ఆమె బురఖా తీసివేసి వేధించాడని, ఇదేంటని నిలదీసిన ఆమె కుమారుడిని చెప్పుతో కొట్టి అవమానించాడని అన్నారు. వైసీపీనేతలకు ముస్లిం మహిళలంటే ఏమాత్రం గౌరవం లేదని ఈ ఘటనలు నిరూపిస్తున్నాయని చెప్పారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు పాల్గొన్నారు.



ముస్లిం మహిళల సమావేశంలో భువనేశ్వరి

భువనేశ్వరికి కుప్పంలో అపూర్వ ఆదరణ

చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రెండు రోజుల కుప్పం పర్యటన విజయవంతమైంది. భర్త తరఫున ఆమె వేసిన నామినేషన్ ఘట్టం పార్టీ సత్తాను జిల్లావ్యాప్తంగా చాటింది. శనివారం జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భువనేశ్వరికి ప్రజల నుంచి ముఖ్యంగా మహిళల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. శుక్రవారం చేపట్టిన నామినేషన్ దాఖలు కార్యక్రమంలో భాగంగా కుప్పంలో నిర్వహించిన ర్యాలీకి జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, సామాన్య జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



డమ్మీ ప్లాన్

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అదనపు వాహనాలు, ఏజెంట్లు నియామకం కోసం డమ్మీ అభ్యర్థులచే నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోటీచేసే అభ్యర్థికి వాహనాల సంఖ్య పరిమితం. అయితే ఆ వాహనాల సంఖ్య సరిపోదని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కొందరు డమ్మీ అభ్యర్థులచే నామినేషన్ వేస్తారు. ఇలా నామినేషన్ వేసిన డమ్మీ అభ్యర్థులు నియోజకవర్గంలో ఎక్కడా తమ ప్రచార కార్యక్రమాలు నిర్వహించరు. వీరి వాహనాలు మాత్రం ఏ పార్టీ జెండా లేకుండా కేవలం అభ్యర్థి స్టిక్కర్లు వేసుకొని నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి సేవలకు ఉపయోగ పడుతుంటారు. అంతేగాక బూత్‌లలో వీరి తరఫున ఏజెంట్లుగా కూడా ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులే నియమించుకొంటారు. ఎవరు ప్రశ్నించినా తమకు సంబంధంలేదని ఇండిపెండెంట్ అభ్యర్థి ఏజెంట్లు అని చెబుతారు. ఇటువంటి డమ్మీ అభ్యర్థులపై ఎన్నికల అధికారులు నిఘావేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు అంటున్నారు.

- పలమనేరు

ఇదీ మందు

సకుటుంబ సపరివారంగా...




ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న చల్లా సుప్రియారెడ్డి, పూజారెడ్డి

తల్లి ఒకచోట, భార్య రొంపిచెర్ల, కుమార్తె పులిచెర్ల, సోదరి చౌడేపల్లె.. ఇలా ఆయా మండలాలను ఎంపిక చేసుకుని పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (చల్లాబాబు) కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బాబు సతీమణి మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆయన తల్లి, రొంపిచెర్ల మాజీ ఎంపీపీ చల్లా ప్రేమలత సమీప గ్రామస్తులను కలుస్తున్నారు. ఆయన కుమార్తె పూజారెడ్డి పులిచెర్ల మండలంలో టీడీపీ నాయకులు, తెలుగుమహిళలతో కలిసి ప్రతి గడపకూ వెళుతూ తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఇక సోదరి వీణారెడ్డి చౌడేపల్లె మండలంలో ప్రచార బాధ్యతలను చేపట్టారు. గతంలో పుంగనూరు గొడవల కేసుల్లోని బాధిత టీడీపీ శ్రేణులకు వీరంతా బాసటగా నిలిచారు.

- పుంగనూరు

నాకేంటట...



పార్టీలో చేరాలా, గెలుపుకోసం పనిచేయాలా అయితే నాకు ఏమిస్తారంటూ ఒక సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మొహమాటం లేకుండా అడిగేసరికి నాయకులు ఖంగుతిన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని ఒక ప్రముఖ పార్టీనుంచి పోటీచేస్తున్న అభ్యర్థి అనుచరులు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడిని కలిశారు. తమ పార్టీలో చేరి ప్రచారం చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇప్పటికే రాజకీయాల్లో పదిహేనెకరాలు అమ్ముకున్నాను. నా వద్ద ఏమీ లేదు. ఇప్పుడు పార్టీలో చేరితే వెంట వచ్చేవారిని నెలరోజులు పోషించాలి. ఎప్పుడో అధికారంలోకి వస్తాం.. ఏదో చేస్తామంటే మోసపోయే వాణ్ణి కాదు. ఇప్పుడేమిస్తారో చెప్పండనే సరికి నాయకులు తెల్లముఖమేశారు. అభ్యర్థినే పంపిస్తామని చెప్పి అక్కడ నుంచి జారుకున్నారు.

- పలమనేరు



నా ఎస్సీలు, నా బీసీలు, నా పేదలు.. అంటూ ప్రతి సభలోనూ సీఎం జగన్ చెబుతారు. తాను లేకుంటే వీరికి సంక్షేమమే లేదని మాటలు చెబుతారు. కానీ.. ఆ పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని 16 నెలలుగా నిలిపేశారు. ఈ లెక్కన జిల్లాకు 1.36 లక్షల టన్నుల బియ్యాన్ని కార్డుదారులు నష్టపోయారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే తనదిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది.

- చిత్తూరు కలెక్టరేట్



కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని ఎండీయూ వాహనం ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

పేదల బియ్యం ఎగ్గొట్టిన జగన్



16 నెలలుగా రూపాయి బియ్యం నిలిపివేత

ఉమ్మడి జిల్లాలో 1.36లక్షల టన్నులు ఇవ్వని రాష్ట్రం

కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే తనదిగా ప్రచారం

కొవిడ్ సమయంలో ఉపాధి లేక.. ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన' కింద ఉచిత బియ్యం అందిస్తోంది. రేషన్‌లో ఇచ్చే బియ్యం విలువ కిలో రూ.35. అందులో కేంద్రం రూ.30, రాష్ట్రం రూ.5 భరిస్తోంది. కుటుంబంలో ఒకరికి ఐదు కిలోల చొప్పున 2020 ఏప్రిల్ నుంచి ఇస్తోంది. ఇక, రాష్ట్ర ప్రభుత్వం రూపాయికి కిలో బియ్యాన్నీ పంపిణీ చేస్తూ వచ్చింది. ఉచిత బియ్యాన్ని డీలర్ల వద్ద.. నగదుకు బియ్యాన్ని ఎండీఎస్ వాహనాల ద్వారా కార్డుదారులకు ఇస్తూ వచ్చారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆపేసింది. దీనికి ఎలాంటి కారణాలు చూపలేదు. సార్టెక్స్ బియ్యం పేరిట కేంద్రంతో పేచీకి దిగింది. ఉచిత బియ్యం ఇవ్వకపోవడంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో వారు సీరియస్ అయ్యారు. ఆ తర్వాత జూలై నుంచి ఉచిత బియ్యాన్నీ పునఃప్రారంభించారు. మొత్తమ్మీద 2022వ సంవత్సరం డిసెంబరు వరకు కార్డుదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఉచిత.. నగదుకు బియ్యాన్ని (రెండు కోటాలు) ఇచ్చారు.

మేమూ ఉచితంగా ఇస్తామంటూ..



కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీని 2023 డిసెంబరు వరకు పొడిగిస్తూ 2022 చివర్లో నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కూడా నగదుకు కాకుండా తామూ ఉచితంగానే రేషన్ బియ్యం ఇస్తామని చెప్పింది. కరోనా తీవ్రంగా ఉన్న రోజుల్లోనే ఉచితంగా ఇవ్వని రాష్ట్రం.. కొవిడ్‌లేని సమయంలో ఉచిత ప్రకటన చేయడం వెనుక ఆంతర్యం ఏమిటా అని పలువురు మల్లగుల్లాలు పడ్డారు. ఏమైతేనేం తవకుతు కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి రెండు కోటాల బియ్యం ఉచితంగా వస్తాయని కార్డుదారులు భావించారు. అయితే, కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని మాత్రమే రేషన్ షాపుల్లో పంపిణీ చేశారు. రాష్ట్ర బియ్యాన్ని ఇవ్వలేదు. ఇక, ఉచిత బియ్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం 2003 చివర్లో నిర్ణయం తీసుకుంది. ఇలా 16 నెలలుగా కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యంతోనే రాష్ట్రం సరిపెట్టేసింది. ఓహో.. రాష్ట్రం ఇస్తామన్న ఉచితం వెనుక ఇదా కథ అని నెమ్మదిగా కార్డుదారులకు అర్థమైంది.

ఏడాదికి ఓ కుటుంబం నష్టపోయింది 7200 రూపాయలు

కేంద్రం ఇచ్చే బియ్యానికి అదనంగా ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమూ ఇవ్వాలి. అలా.. నలుగురు కుటుంబ సభ్యులున్న కుటుంబానికి రూ.20కి 20 కిలోల బియ్యం ఇచ్చుంటే నెలకు సరిపేడది. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.40 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. రేషన్ బియ్యం ధర రూ.30 అనుకున్నా.. నలుగురున్న కుటుంబానికి నెలకు రూ.600 .. ఏడాదికి రూ.7200 నష్టపోయినట్లే. అసలే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల మోత, ఆస్తి పన్ను బాదుడుతో సతమతమవుతున్న పేదలకు.. రాష్ట్రం కోటా రేషన్ బియ్యం కూడా పంపిణీ చేసుంటే కొంత ఊరటగా ఉండేది.

పేదలకు ఇవ్వని 1.36 లక్షల టన్నుల బియ్యం

ఉమ్మడి జిల్లాలో సరాసరి 5.30 లక్షల రేషన్‌కార్డులు చెలామణిలో ఉన్నాయి. నెలకు 8500 టన్నుల ఉచిత బియ్యం అవసరం. 2023 జనవరి నుంచి 2024 ఏప్రిల్ వరకు 16 నెలలపాటు.. నెలకు 8500 టన్నుల వంతున 1.36లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా ఎగ్గొట్టింది. కేంద్రం ఇస్తున్న బియ్యాన్నే తాము ఉచితంగా ఇస్తున్నట్లు బిల్డప్ ఇస్తూవచ్చింది.

పూతలపట్టు వర్తమానం

పూతల'పట్టు'కు టీడీపీ వ్యూహం

- ఏడాదిగా ప్రజల మధ్య మురళీమోహన్
- సమన్వయం, సమర్థ నాయకత్వంతో అడుగులు
- ఎంఎస్ బాబు పోటీతో అధికార వైసీపీలో గుబులు

పూతలపట్టు నియోజకవర్గం ఆవిర్భవించాక ఒక్కసారి కూడా గెలవని టీడీపీ ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని గట్టి పట్టుదలతో ఉంది. ఆ పార్టీ అభ్యర్థి మురళీమోహన్ అన్ని మండలాల్లోని కింది స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి నాయకులను కలుపుకొని ముందుకెళుతున్నారు.

- చిత్తూరు



మురళీమోహన్

2009 పునర్విభజనలో ఏర్పడిన పూతలపట్టు నియోజకవర్గం నుంచి మొదటి ఎన్నికలో కాంగ్రెస్ తరఫున డాక్టర్ రవి విజయం సాధించారు. 2014లో సునీల్‌కుమార్, 2019లో ఎంఎస్‌బాబు వైసీపీ నుంచి గెలిచారు. గత రెండు ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. వరుసగా మూడు ఎన్నికల్లో ఓడిపోయిన లలిత కుమారి 2019 తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. దీంతో ఆ పార్టీ గతేడాది మురళీమోహన్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి ఆయన నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను కుగ్రామాలకు సైతం తీసుకెళుతున్నారు. ఇటీవల చేపట్టిన జయహో బీసీ సభలకు స్పందన బాగుంది. వైసీపీ నుంచి పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. గట్టి పట్టున్నప్పటికీ నాయకత్వలేమితో ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలకు ఆ లోటు తీరుస్తూ మురళీమోహన్ నేనున్నానంటూ భరోసా ఇస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. టికెట్ రాని సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల వల్ల వైసీపీ ఓట్లకు గండి పడటం తమకు అనుకూలిస్తుందని టీడీపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

అక్రమాలపై ప్రజా వ్యతిరేకత

వైసీపీ నేతల అండదండలతో కొందరు తవణంపల్లె, బంగారుపాళ్యం, పూతలపట్టు, ఐరాల, యాదమరి మండలాల్లో కర్ణాటక మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయించి సొమ్ముచేసుకున్నారు. ఇసుక, మట్టిలనూ తరలించారు. అనుమతుల్లేకుండా రాత్రి వేళల్లో గ్రానైట్ రాళ్లను ఇతర రాష్ట్రాలకు తోలి లక్షలాది రూపాయలను సంపాదించారు. ప్రతి మండలంలోనూ పేకాట క్లబ్బుల ద్వారా డబ్బులు వెనకేసుకున్నారు.అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలపై ప్రజల్లో బలమైన వ్యతిరేకత ఉంది. వైసీపీ టికెట్ పొందిన సునీల్ కుమార్ నాయకత్వంపై నియోజకవర్గ స్థాయి నేతలు అసంతృప్తిగా ఉన్నారు. సునీల్‌కు టికెట్ రావడం ఓ మంత్రికి కూడా ఇష్టంలేదని ఆ పార్టీ వారే చెప్పుకుంటున్నారు.



సునీల్‌కుమార్

వైసీపీకి బాబు స్ట్రోక్

జిల్లా మంత్రి, నియోజకవర్గంలోని పార్టీ సామాజిక వర్గాల నాయకులు చెప్పినట్లు నడుచుకోలేదనే కారణంతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్‌బాబుకు వైసీపీ ఈసారి టికెట్ ఇవ్వలేదు. దాంతో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రవి కూడా ఎంఎస్ బాబుతో జతకట్టారు. ఎంఎస్ బాబుకు సొంత మండలం యాదమరితో పాటు మిగిలిన మండలాల్లో బంధువర్గం ఉంది. ఈ ఐదేళ్ల పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా చేసిన మేలుతో పాటు వైసీపీపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలిస్తుందని ఈయన భావిస్తున్నారు.




ఎంఎస్ బాబు

హేమాహేమీల ప్రాతినిధ్యం

● నగరి చరిత్ర

రెండు మున్సిపాలిటీలున్న నియోజకవర్గం నగరికి రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించడంతో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు ఈ నియోజకవర్గం విశిష్టత. ఇక్కడ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో గాలి ముద్దుకృష్ణమనాయుడు, రెడ్డివారి చెంగారెడ్డి, ఆర్కే రోజా, ఈవీ గోపాల్‌రాజు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందారు. నింద్ర మండలం కొప్పేడుకు చెందిన చెంగారెడ్డి ఇక్కడ నుంచి 8 సార్లు పోటీ చేసి ఐదుసార్లు విజయం సాధించారు. వడమాలపేట మండలం తప్ప మిగిలిన అన్ని మండలాల్లో తమిళులు గెలుపోటములను శాసించే స్థాయిలో ప్రభావం చూపుతున్నారు. తమిళనాడు సరిహద్దుకు ఆనుకుని ఉండడంతో అక్కడి వివిధ పరిణామాలు ఇక్కడి ఓటర్లపై ప్రభావం చూపుతుంటాయి.

- పుత్తూరు అర్బన్



ఎమ్మెల్యేలు

1962-దొమ్మరాజు రాజగోపాల్‌రాజు	- ఇండిపెండెంట్
1967-కిలారి గోపాల్‌నాయుడు	- కాంగ్రెస్
1972 - కిలారి గోపాల్‌నాయుడు	- కాంగ్రెస్
1978 -రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
1983 -ఈవీ గోపాల్‌రాజు	- టీడీపీ
1985 -రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
1989 -రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
1994 -వీ. దొరస్వామిరాజు	- టీడీపీ
1999 - రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
2004 - రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
2009 -గాలి ముద్దుకృష్ణమనాయుడు	- టీడీపీ
2014 -ఆర్‌కే రోజా	- వైసీపీ
2019 -ఆర్‌కే రోజా	- వైసీపీ

ఓటర్ల సంఖ్య: 2,01,768

పురుషులు: 98,177 – స్త్రీలు: 1,03,583

ఇతరులు: 08

నియోజకవర్గం ఆవిర్భావం : 1962

ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది : 13

నియోజకవర్గం పరిధి : విజయపురం, నింద్ర, నగరి రూరల్, పుత్తూరు రూరల్, వడమాలపేట. మున్సిపాలిటీలు : నగరి, పుత్తూరు

వి.కోట..విజయబాట

పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గంలో వి.కోట మండల ఓటర్ల తీర్పు విజయాన్ని ప్రభావితం చేయనుంది. ఈ మండలమే నిర్ణయాత్మక శక్తిగా అభ్యర్థులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలతో పాటు ఒక మున్సిపాలిటీ ఉంది. 2,67,635 మంది ఓటర్లున్న ఈ నియోజకవర్గంలోని మండలాల వారీగా పరిశీలిస్తే పెద్దపంజాణిలో 44,712, గంగవరంలో 44,777, బైరెడ్డిపల్లి మండలంలో 43,377, పలమనేరులో 23,681, పలమనేరు మున్సిపాలిటీలో 41, 535 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్క వి.కోట మండలంలోనే 70,583 మంది ఓటర్లు ఉండటం విశేషం. నియోజకవర్గంలోని ఓటర్లలో 26 శాతం మంది ఈ మండలంలోనే ఉన్నారన్నమాట. దీంతో అభ్యర్థి గెలుపులో వి.కోట మండల ప్రజల తీర్పు కీలకం కానుంది.

- పలమనేరు



● హ్యాట్రిక్ వీరులు

ఎమ్మెల్యే, ఎంపీగా.. రామకృష్ణారెడ్డి



ఓటమి ఎరుగని ధీరుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నూతనకాల్వ రామకృష్ణారెడ్డి పేరొందారు. పుంగనూరు ఎమ్మెల్యేగా, చిత్తూరు ఎంపీగా హ్యాట్రిక్ విజయాలు సాధించి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. నాటి పుంగనూరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం కెళవాతికి చెందిన ఎన్.రామకృష్ణారెడ్డి వార్డు సభ్యుడి నుంచి సర్పంచి, చౌడేపల్లె పంచాయతీ సమితి అధ్యక్షుడు, చిత్తూరు జడ్పీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 1983లో పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆర్టీసీ కండక్టర్ బగ్గిడి గోపాల్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేశారు. 1985లో టీడీపీ అభ్యర్థిగా ఎన్.రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కె.పద్మావతమ్మ, 1989లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్.వేణుగోపాల్ రెడ్డి, 1994లో స్వతంత్ర అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిపై పోటీ చేసి వరుసగా మూడు పర్యాయాలు రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ కొట్టారు. అలాగే, 1996లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చిత్తూరు ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఈ సందర్భంగా జరిగిన ఉప ఎన్నికలో పుంగనూరు ఎమ్మెల్యేగా ఆయన కుమారుడు ఎన్.అమరనాథరెడ్డి గెలిచారు. అలాగే 1998, 1999ల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎంపీగా రామకృష్ణారెడ్డి పోటీ చేసి గెలిచారు. చీ

- పుంగనూరు

ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి

నియోజకవర్గాల పునర్విభజన వల్ల పీలేరు నుంచి పుంగనూరు వచ్చి 2009, 2014లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టీడీపీ అభ్యర్థి ఎం.వెంకటరమణరాజుపై రెండుమార్లు, 2019లో టీడీపీ అభ్యర్థి ఎన్.అనీషారెడ్డిపై వరుసగా మూడుమార్లు గెలిచారు. పుంగనూరు ఎమ్మెల్యేలుగా ఇద్దరు హ్యాట్రిక్ సాధించారన్న మాట.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సైకిలెక్కిన ఏలుమలై మొదలియార్

చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం ● ఫలించిన గాలి భానుప్రకాష్ రాజతంత్రం ● నగరి వైసీపీలో భారీ కుదుపు



చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకుంటున్న డీఎస్ ఏలుమలై, లక్ష్మీపతియాదవ్, వెంకటముని

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20: నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్‌కు నగరి నియోజకవర్గ వైసీపీకి మైండ్ బ్లాక్ అయ్యింది. వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ, మంత్రి రోజాపై అసమ్మతి నాయకుడు డీఎస్ ఏలుమలై మొదలియార్ (అమ్ములు)సైకిలెక్కారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సత్యవేడు పర్యటన సందర్భంగా శనివారం ఆయన చేతుల మీదుగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు ముఖ్య అనుచరులైన డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ ఎస్.లక్ష్మీపతి యాదవ్, ప్రముఖ బిల్డర్ వెంకటముని కూడా టీడీపీ కండువాలు కప్పుకున్నారు. దీంతో నియోజకవర్గ వైసీపీలో తీవ్ర అలజడి నెలకొంది.

భానుప్రకాష్ మంత్రాంగం...

2019 ఎన్నికల తరువాత వైసీపీలో బలమైన నాయకులను మంత్రి రోజా దూరం పెట్టి ఆమె కుటుంబసభ్యులకు సేఫ్ పాసేజ్ ఇచ్చారు. దీంతో ఆయా మండలాల్లో నాయకులు ఎదురుతిరిగారు. వీరి మధ్య సయోధ్య కోసం పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రోజాకు మరోసారి టికెట్ ఇవ్వద్దని అసమ్మతి నాయకులు తిరుగుబాటు చేశారు. వీరి అభ్యర్థనలను వైసీపీ అధిష్ఠానం బేఖాతర్ చేస్తూ మళ్లీ ఆమెకే టికెట్ ఖరారు చేసింది. సరిగ్గా ఈ అవకాశాన్ని గాలి భానుప్రకాష్ సద్వినియోగం చేసుకున్నారు. పలుమార్లు చర్చలు జరిపి తనవైపు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యారు. గాలి భానుప్రకాష్ పదునైన వ్యూహంతో సూపర్ సక్సెస్ కావడం ఆ పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్‌కు ముందుగా మరికొందరు కీలక నాయకులను చేర్చుకుని వైసీపీని కోలుకోలేని దెబ్బకొట్టేందుకు గాలి భానుప్రకాష్ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

రోజాకు చుక్కలే...

రానున్న ఎన్నికల్లో మంత్రి రోజాకు చుక్కలు కనబడడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో మొదలియార్ సామాజికవర్గ ఓటర్లు ప్రభావిత స్థాయిలో ఉన్నారు. ఈ సామాజికవర్గం నుంచి బలమైన నాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీకి విశేషంగా కలిసిరానుంది. మాజీ మంత్రి చెంగారెడ్డి అనుచరుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఏలుమలై పుత్తూరు ఎంపీపీ, సర్పంచ్, రెండుసార్లు మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. అలాగే ఆయన కుటుంబానికి పుత్తూరులో బలమైన పట్టు ఉంది. తాత, మామ కూడా దశాబ్దాల పాటు పుత్తూరు సర్పంచ్‌గా పనిచేసి ఉన్నారు. 2014 ఎన్నికల ముందు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఉన్న అనుబంధంతో వైసీపీ కండువా కప్పుకున్నారు. రెండు ఎన్నికల్లోను రోజా గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించారు. పుత్తూరు, నగరి పట్టణంలో బలంగా ఉన్న మొదలియార్ సామాజికవర్గాన్ని ప్రభావితం చేయగలిగిన ఏలుమలై చేరికతో ఆ పార్టీలో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది. దీంతో పాటు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్‌లో సిద్ధహస్తులైన నాయకులను టీడీపీలోకి తీసుకురావడంతో మ్యాచ్ ప్రారంభానికి ముందే గాలి భానుప్రకాష్ సిక్సర్ కొట్టారని ఆ పార్టీ కేడర్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి గడపనూ టచ్ చేయాలి

టీడీపీ ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు దగ్గుమళ్ల, గురజాల

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 20: ప్రతి గడపనూ టచ్ చేసి కూటమి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ఓటర్లకు వివరించాలని కూటమి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో చిత్తూరు రూరల్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు చాలా కీలకమని, ఓటర్లను చైతన్య పరచి టీడీపీకి ఓట్లు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, మంజూష్, మేషాక్, దేవరాజులు నాయుడు, నీలకంఠనాయుడు తదతరులు పాల్గొన్నారు.

చిత్తూరు(సెంట్రల్) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు కష్టపడి పని చేయాలని పార్టీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. చంద్రబాబు జన్మదిన వేడుకలు శనివారం చిత్తూరు జిల్లా పార్టీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్ అధ్యక్షతన నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసిన సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్‌తోపాటు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఉమ్మడి ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ● ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాద్‌రావు అధ్యక్షతన శనివారం ఆయన కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ నాయకులు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, వైవీ రాజేశ్వరి, కటారి హేమలత, త్యాగరాజన్, వెంకటేష్, రాజశేఖర్, మోహన్‌రాజ్, సుబ్రి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సస్పెన్షన్ వేటు : జేసీ



నియోజకవర్గ అధికారులతో సమావేశమైన జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సస్పెన్షన్ వేటు తప్పదని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ బృందాల అధికారులతో సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ తనిఖీల సమయాల్లో పట్టుబడే నగదు, బంగారం, వెండి, మద్యం తదితరాల పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రచారాల కోసం పార్టీలకిచ్చిన వాహనాల పత్రాలను ప్రతి వాహనంపై అతికించాలని, అనుమతి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో మూడు రెవెన్యూ చెక్‌పోస్టులు, పోలీసు శాఖచే 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఏఈఆర్వోలు, చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ, తహసీల్దార్లు శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, ఎంపీడీవోలు సుధాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : సీకే బాబు



భారీ కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 20: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సీకేబాబు పేర్కొన్నారు. టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ షణ్ముగం అధ్యక్షతన శనివారం స్థానిక తోటపాళ్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకేబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి భారీ కేక్ కట్ చేసి స్థానిక ప్రజానీకానికి అందజేశారు. అనంతరం సీకేబాబు చేతుల మీదుగా వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులైన ప్రసాదరావు, గురజాల జగన్మోహన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జయకుమార్, చిన్ని, దుర్గ, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నగరి : నగరి పట్టణంలో కరకంఠేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబు పేరు మీద అర్చనలు చేయించారు. అన్నదానం చేశారు. అనంతరం నగరి టీడీపీ కార్యాల యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు, బాలాజీ, సురేష్‌నాయుడు, అల్లిముత్తు, శ్రీధర్, రాజా, సెల్వం, శ్రీనివాసులురెడ్డి, అశోక్, మదివాసన్, మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు : మండల టీడీపీ ప్రధానకార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో చిన్నకలికిరిలో భారీ కేక్ కట్‌చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, హరిబాబు నాయుడు, బాస్కర్, యువరాజులునాయుడు, తలారి రెడ్డెప్ప, కృష్ణమూర్తినాయుడు, సురేష్, ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలకేంద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చిత్తూరు పార్లమెంటరీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పీటర్, టీడీపీ సీనియర్ నాయకులు చెన్నకేశవులు నాయుడు, ప్రతాప్ నాయుడు, గుర్రప్ప నాయుడు, బాలాజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం : స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బంగారుపాళ్యం : మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యం లో కేక్ కట్‌చేశారు. బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

యాదమరి : మండల కేంద్రంలో టీడీపీ నాయకులు మురార్జీ, వెంకటేశ్ రబి, అమరనాథనాయుడు, హేమగిరి తదితరుల ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు.

వెదురుకుప్పం : స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ ఎన్ఆర్ఐ నియోజకవర్గ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కావలి చక్రి, క్లస్టర్ ఇన్‌చార్జిలు కె.చెంగల్రాయరెడ్డి, పి.మోహన్‌మురళి, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా సరిత నామినేషన్

నగరి ఏప్రిల్20: సమాజ్‌వాది పార్టీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వెదురుకుప్పం మండలానికి చెందిన వేపంజేరి సరిత శనివారం నామినేషన్ దాఖలు చేశారు. శనివారం సాయంత్రం వరకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ తరఫున గాలిభానుప్రకాష్, వైసీపీ తరఫున ఆర్‌కే రోజా, సమాజ్‌వాది పార్టీ తరఫున సరిత, ఇండిపెండెంట్‌గా ధనశేఖరశెట్టి నామినేషన్లు వేశారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టో కరపత్రాల పంపిణీ

నింద్ర, ఏప్రిల్ 20: మండలంలోని కొప్పేడు, కావనూరు, శ్రీరామపురం, ఐఆర్ కండ్రిగ, ఎలాకాటూరు, ఆరూరులలో శనివారం కాంగ్రెస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు కాంగ్రెస్ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి పి.రాకేష్ రెడ్డి ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలు ఖాతాల్లో సంవత్సరానికి రూ.లక్ష, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పేదలకు పక్కాఇళ్లు వంటి పథకాలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆర్.బాబు, నటరాజ్‌మొదలి, నాయకులు ఢిల్లీ, పురుషోత్తం సుధాకర్, చిరంజీవి రెడ్డి, రత్నం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ వస్తే రాష్ట్రం అధోగతే..

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 20: వైసీపీ ఐదేళ్లపాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని, మరోసారి జగన్ అధికారంలోకి వస్తే ఆంధ్రరాష్ట్రం పరిస్థితి అధోగతి పాలవుతుందని జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, టీడీపీ మహిళానేత శాంతిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్ అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లెలో శనివారం నేతలతో కలిసి శాంతిరెడ్డి కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, నేతలు దేవరాజులునాయుడు, కొత్తపల్లిమిట్ట సూరిరెడ్డి, జయరామిరెడ్డి, తుకారాంరెడ్డి, మాధవరెడ్డి, వెంకటేష్‌యాదవ్, మునికృష్ణారెడ్డి, శ్రీనివాసులు, మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి

పూతలపట్టు, ఏప్రిల్ 20: రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. శనివారం ఆయన వావిల్‌తోట పంచాయతీలోని గ్రామాల్లో మండల నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ నాయకులు యువరాజులు నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు రామూర్తినాయుడు, గోవర్ధన్‌నాయుడు, జగన్నాథం, ప్రమోద్, చిరంజీవి, చంద్రమౌళి, కృష్ణమూర్తి, భార్గవ్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లను గెలిపించుకోవాలని మాజీ జడ్పీటీసీ కళావతి, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహేంద్ర అన్నారు. శనివారం వారు మండలంలోని గుండ్లకట్టమంచి, నల్లసిద్దనపల్లి, నూనెగుండ్లపల్లి, మిట్టపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, ఏప్రిల్20: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూల మాలలతో ఊయలలో అలంకరించి ఊంజల సేవ నిర్వహించారు. అనం తరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

'మా పొలానికి వెళ్లే దారిని తవ్వేశారు'



గుడిపాల, ఏప్రిల్ 20: మా పొలానికి వెళ్లే దారిలో ఉన్న ఓ ఫ్యాక్టరీని లీజుకు తీసుకున్న వ్యక్తి దౌర్జన్యంగా గోతులు తవ్వి దారి లేకుండా చేశారని 190 రామాపురం బోయఇండ్ల కు చెందిన కుటుంబాల వారు ఆవేదన వెల్లబుచ్చారు. తమకు సర్వే నెంబరు 358/3, 358/4లో భూములున్నాయని, చిత్తూరు రూరల్ మండలం నరిగపల్లి రెవిన్యూ గ్రామానికి చెందిన రాజేశ్వరి, కృష్ణయ్య కుటుం బాలకు సంబంధించిన పొలాల పక్కనే వున్న జెల్లీ (గులకరాళ్ళు) ఫ్యాక్టరీ లీజుకు తీసుకున్న వ్యక్తులు దౌర్జన్యంగా మీకు దారిలేదంటూ జేసీబీతో గోతులు తీశారన్నారు. అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముస్లింల సంక్షేమమే టీడీపీ లక్ష్యం : గురజాల

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 20: ముస్లిం మైనార్టీల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో మైనార్టీల ఆత్మయ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ముస్లిం మైనార్టీలు అభివృద్ధి చెందారన్నారు. అదేస్ఫూర్తితో చిత్తూరు నియోజకవర్గంలోని ముస్లింలకు జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ తరపున ఈద్గా కోసం 5 ఎకరాల స్థలాన్ని, షాదీ మహల్ కోసం రెండు ఎకరాలు, శ్మశాన వాటికకు రెండు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఇసుక, మట్టి, గంజాయి, సారా అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు మద్యం అక్రమ రవాణా, లాటరీ విక్రయాలకు చెక్ పెడుతానన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిపై ఎర్రచందనం అక్రమ రవాణా తదితర 16 కేసులున్నాయని గుర్తు చేశారు. అలాంటి వారిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ముస్లిం మైనారిటీ నేతలు జాఫర్, అత్తుబాయ్, మున్నాఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 29వ డివిజన్‌లో ఉమ్మడి అభ్యర్థుల తరపున బీజేపీ నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేపట్టారు.

ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 20: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులు మే 6వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని కోఆర్డినేటర్ మీరా సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 26 నుంచి జూన్ ఒకటవ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పైపులు, రాతి కూసాలు ధ్వంసం



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 20: ఓ రైతు పొలంలో పైపులు, డ్రిప్ పరికరాలను దుండగులు ధ్వంసం చేసిన ఘటన శ్రీరంగరాజపురం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు... గంగమ్మగుడి గ్రామానికి చెందిన రైతు పి.నరసింహనాయుడు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు డ్రిప్ పైపులు, వైర్లు, 70 రాతి కూసాలను ధ్వంసం చేశారు. సుమారు 3లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు.

వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



బట్టీకండ్రిగలో కరపత్రం అందిస్తున్న నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 20: అవినీతికి పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతూ టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బరాజు కోరారు. మీ కోసం...మీ ఇంటికి భాను కార్యక్రమంలో భాగంగా శనివారం బట్టీకం డ్రిగ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎన్నికల హామీలను వివరిస్తూ, నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. విజన్ కల్గిన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయులునాయుడు, వెంకటయ్య, సుబ్రమణ్యంరెడ్డి, హేమావతి, లక్ష్మీప్రసన్న, ఉదయ్‌యాదవ్, రామూర్తినాయుడు, రవినాయుడు, పొన్నాయ్ రాజు, సుబ్రమణ్యం, రఘు, వెంకటరమణ, వెంకటేష్, మోహన్, గిరిబాబు, నారాయణరాజు, శివశంకర్, నితీష్, శివరాయల్, కుమార్, దేవ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు వితరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 20: స్థానిక ప్రభుత్వసుపత్రి ప్రసూతివార్డులో శనివారం సత్యసాయి సేవసమితి మహిళా సభ్యులు మాస మహిళాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు, బ్రెడ్, నూతన వస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్.శేషనారాయణ, గజేంద్రరెడ్డి, బి. పాండురంగం. శ్రీకంఠయ్య పాల్గొన్నారు.

టీడీపీ అధికార ప్రతినిధికి సన్మానం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 20: రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధిగా ఎంపికైన సురేంద్రకుమార్‌కు చిత్తూరు టీడీపీ ఆఫీస్‌లో శనివారం నేతలతో కలిసి టీఎన్‌టీయూసీ పార్లమెంట్ అధ్యక్షుడు రావిళ్ళ మాధవనాయుడు, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, పార్లమెంట్ అధికార ప్రతినిధి జీవరత్నంలు శాలువాలు కప్పి సన్మానం చేశారు. టీడీపీ నేతలు సంపత్, నగరి మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

చిత్తూరు, ఏప్రిల్ 20: కొంగారెడ్డిపల్లెలోని సీఆర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం స్వీప్ బృందంతో కలిసి ఓట హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు, స్వీప్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వైసీపీ నాయకుడు

విజయపురం, ఏప్రిల్ 20: విజయపురం దళితవాడకు చెందిన వైసీపీ నాయకుడు రత్నం శనివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీలో ఇమడలేక కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

నగరి ఏప్రిల్20: నగరిలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలలో శనివారం అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే తొలుత ఎలా స్పందించాలి, మంటల ను ఎలా అదుపు చేయాలి అన్న అంశాలపై అవగాహన కల్పించి డెమో నిర్వహించారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

విజయపురం, ఏప్రిల్ 20: మండలంలోని నారపరాజుకండ్రిగలో టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రరాజు(80) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల మాజీ అధ్యక్షుడు దశరథరాజు, గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు రాఘవరాజు తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుమారుడు సుధాకర్‌రాజును పరామర్శించారు.

మయూర వాహనంపై కాశీవిశ్వేశ్వరుడి విహారం



రామకుప్పం, ఏప్రిల్ 20: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు, అమ్మవారితో కలిసి మయూర వాహనంపై విహరించారు. ఉభయదారులు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవర్లను మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి విద్యుద్దీప, పుష్పాలంకృత మయూర వాహనంలో అమ్మవారితో కలిసి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. రాత్రి ఆలయం ఎదుట కర్ణాటక రాష్ట్రం చిన్నకొత్తూరుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పండరి భజన వీక్షకులను అలరించింది.

కమనీయం.. సీతారాముల కల్యాణం

సోమల, ఏప్రిల్ 20: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె కోదండ రామాలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదారులు పట్టుసిరి రాజశేఖర్ భక్తులకు అన్నదానం చేశారు. నాగిళ్లవారిపల్లె, బసవపల్లె, రెడ్డివారిపల్లె, ఆవులపల్లె, కొత్తూరు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అలాగే పత్రపల్లె రామాలయంలో భాగవ తారిణి అనసూయ సీతాదేవి అరణ్య వాసం హరికథ భక్తులను ఆకట్టుకుంది.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కల్లూరు, ఏప్రిల్ 20: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ కురవ పల్లిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం వేడుకలు వైభవో పేతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయశుద్ధి, ఆలయప్రవేశం, విష్వక్సేనారాధన, భగవతారాధన, గంగస్వీకరణ, గోపూజ నిర్వహించారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనము, కంకణధారణ, అంకురార్పణ, కలశప్రతిష్ఠ, అగ్నిప్రతిష్ఠ, మంత్రహోమం, లఘుపూర్ణాహుతి, క్షీరాభిషేకం, అర్చన, మంత్ర పుష్పం, తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 9 గంటలకు యంత్రస్థాపన, యంత్రప్రతిష్ఠ, కలశప్రతిష్ఠ పూజలు నిర్వహించారు.

●నేడు సీతారాముల విగ్రహప్రతిష్ఠ వేడుకలు

కురవపల్లిలో ఆదివారం ఉదయం 8 నుంచి 9గంటల మధ్య సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకం వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కళ్యాణోత్సవం, రాత్రి సీతారాముల పుష్పపల్లకి ఊరేగింపు ఉంటుందని వివరించారు.

23న పౌర్ణమి గిరి ప్రదక్షణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 20: గిరింపేటలోని సుబ్రమణ్యేశ్వరాలయంలో ఈనెల 23 సాయంత్రం స్వామి అమ్మవార్లకు పౌర్ణమి గిరిప్రదక్షణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేక రథంపై అధిష్ఠించి పురవీధులో ఊరేగించనున్నారు. ఇదిలా ఉండగా గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు స్వామివారికి పౌర్ణమి పల్లకి సేవ నిర్వహించనున్నారు.

వలంటీర్ల రాజీనామా

బంగారుపాళ్యం, ఏప్రిల్ 20: బంగారుపాళ్యం-12, తగ్గువారిపల్లె పంచాయతీ, పాలేరు పంచాయతీ, మొగిలి, నల్లంగాడు, మొగిలివారిపల్లి, మహాసముద్రం సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లు శనివారం రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు అందించారు.

టీడీపీ తరపున వడ్డెర్ల ప్రచారం

యాదమరి, ఏప్రిల్ 20 : ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌ల గెలుపునకు శనివారం వడ్డెర సాధికార సమితి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రచారం చేశారు. ఆరిమాకులపల్లె, దాసరాపల్లె, జంగాలపల్లె, కండ్రిగ గ్రామాల్లో సమితి అధ్యక్షుడు ధరణీప్రకాష్ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజు, మాజీ సర్పంచ్ ఆరణి బాలాజీ, యూనిట్ ఇన్‌చార్జి నరేష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

ఆంధ్ర సరిహద్దులో చెక్‌పోస్టుల తనిఖీ



గుడిపాల, ఏప్రిల్ 20: మండలంలోని ఆంధ్ర సరిహద్దులో వున్న చెక్‌పోస్టులను శనివారం అధికారులు తనిఖీ చేశారు. చెన్నై రహదారిలోని సియోన్‌మలై చర్చి వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టులో, వేలూరు రూట్‌లోని గొల్లమడుగు చెక్‌పోస్టును డిప్యూటీ కలెక్టర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్, అసెంబ్లీ అబ్జర్వర్లు వాహనాల తనిఖీ పనితీరు, రికార్డులపై ఆరాతీశారు.

గజవాహనంపై కోదండరాముడు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 20: స్థానిక కోదండ రామాలయంలో ఏడు రోజులుగా శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం స్వామికి సింగపూరు సుబ్రమణ్యం ధర్మేంద్ర, టి.కె. చిట్టిబాబుతోపాటు ఆలయ వాణిజ్య సముదాయ వర్తకుల ఉభయంతో వేణుగోపాల అలంకారంలో వసంతోత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ఎదుట స్వామి అమ్మవార్లకు వయ్యాళి సేవను తిరువళ్ళూరు, తంజావూరు కళాకారులు ప్రదర్శించారు. సాయంత్రం బి.రజని, బి.గోపాలకృష్ణ, ఎస్. వాసుదేవన్ (వైజాగ్) ఉభయంతో స్వామిని గజవాహనంపై అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలో అర్చకులు వేణుగోపాల్, ఈవో సుబ్రమణ్యంనాయుడు, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు మురళి, జిల్లా కన్వీనర్ వేలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో తెలియజేశారు.